# ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం చేయద్దు

- డీఆర్డీవో శేషాద్రి
- కోటపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక




కోటపల్లిలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కోటపల్లి, డిసెంబర్ 15 : కూలీలకు ఉపాధి కల్పించేందుకు నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి సూచించారు. కోటపల్లి మండలకేంద్రంలోని రైతువేదిక ఆవరణలో శుక్రవారం ఎంపీపీ మంత్రి సురేఖ అధ్యక్షతన జరిగిన 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పించడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పనులు నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. ఉపాధి పనులను నిర్లక్ష్యం చేసినా, కూలీల రావల్సిన డబ్బుల్లో అక్రమాలకు పాల్పడిన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. 2022 జనవరి 1 నుంచి 2023 మార్చి 31 వరకు కోటపల్లి మండలంలో జరిగిన ఉపాధి పనుల పై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించగా వారి తుది వేదికను ప్రజా వేదికలో చదివి వినిపించారు. గ్రామపంచాయతీల వారీగా తనిఖీ బృందాలు వారి తనిఖీ నివేదికలను చదివి వినిపించగా ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి జరిమానాలు విధించడంతో పాటు డబ్బుల రికవరీకి ఆదేశించారు. మస్టర్లు, రికార్డుల నిర్వహణలో తప్పులు చేయడం, కొన్ని చోట్ల సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందాలు వెల్లడించాయి. నిబంధనలు పాటించకుండా జరిగిన పనుల్లో డబ్బులు రికవరీ చేయాలని, అక్రమాలు జరిగిన చోట విచారణ జరిపి తుది నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకోనున్నట్లు డీఆర్డీవో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే భాస్కర్, అంబుడ్స్‌మన్ శివరాం, క్యూసీ చంద్రశేఖర్, డీపీవో సురేశ్, ఏపీడీ శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

**రూ.63వేలు జరిమానా, రూ.695119 రికవరీ**

సామాజిక తనిఖీల్లో అక్రమాలను గుర్తించిన తనిఖీ బృందాలు వారి తుది నివేదికను ఉపాధిహామీ ప్రజా వేదికలో చదివి వినిపించగా రూ.63వేలు జరిమానా, రూ.695119 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎసన్వాయి, సర్వాయిపేట, పంగిడిసోమారం, లింగన్నపేట, ఎదుల్లబంధం, అన్నారం, వెంచపల్లి, సిర్సా గ్రామపంచాయతీలకు తనిఖీ బృందాలు క్లీన్ చిట్ ఇచ్చాయి. నక్కలపల్లిలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.359 రికవరీకి, పుల్లగామలో రూ.2000 ఫెనాల్టీ, రూ.47138 రికవరీకి, పినారంలో రూ.793 రికవరీ, ఎడగట్టలో రూ.1020 రికవరీ, జనగామలో రూ.41000 ఫెనాల్టీ, రూ.142847 రికవరీ, కొల్లూరులో రూ.3000 ఫెనీల్టీ, రూ.120480 రికవరీ, ఆలుగామలో రూ.29098 రికవరీ, బబ్బెరచెల్కలో రూ.12వేలు ఫెనాల్టీ, రూ.159933 రికవరీ, బొప్పారంలో రూ.15731 రికవరీ, వెలమపల్లిలో రూ.2000 ఫెనాల్టీ, 44972 రికవరీ, దేవులవాడలో రూ.1000 ఫెనాల్టీ, రూ.20021 రికవరీ, కొండంపేటలో రూ.1720 రికవరీ, రాజారంలో రూ.6103 రికవరీ, నాగంపేటలో రూ.857 రికవరీ, పారుపల్లిలో రూ.53574 రికవరీ, లక్ష్మీపూర్‌లో రూ.1274 రికవరీ, రాపనపల్లిలో రూ.633 రికవరీ, రొయ్యలపల్లిలో రూ.1313 రికవరీ, పాత సూపాకలో రూ.2000 ఫెనాల్టీ, రాంపూర్‌లో రూ.18335 రికవరీ, షట్‌పల్లిలో రూ.2986 రికవరీ, మల్లంపేటలో రూ.13370 రికవరీ, కోటపల్లిలో రూ.6562 రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## చెన్నూర్‌లో అంతర్గత రహదారుల నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ తుమ్మ రమేశ్

చెన్నూర్, డిసెంబర్ 15: గత కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చెన్నూర్ పట్టణంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రూ.28 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో వార్డుల్లో మురుగు కాలువలు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు కూడా టెండర్ల నిర్వహణ అప్పట్లోనే పూర్తి కావడంతో పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారు. పలు వార్డుల్లో మురుగు కాలువలను నిర్మిస్తున్నారు. వార్డుల్లోని అంతర్గత రహదారుల్లో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ మురుగు కాలువలు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మురుగు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణంతో కాలనీల్లో అంతర్గత రహదారులు అభివృద్ధి చెందనున్నాయి. పట్టణంలోని 16వ వార్డులో నిర్మిస్తున్న అంతర్గత రహదారుల పనులను ఆ వార్డు కౌన్సిలర్ తుమ్మ రమేశ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ పరిశీలించారు. పనులను నాణ్యతతో నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

## రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

రామకృష్ణాపూర్, డిసెంబర్ 15: మందమర్రిలో ఈ నెల 17న మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో డాక్టర్ విశ్వనాథ మహర్షి (మాతా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని ఏరియా సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం 17వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ఇంతకు ముందు హాజరైన వారు, ఇప్పుడు కొత్తగా వైద్యం కోసం వచ్చే వారు అందరూ హాజరై ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోగలరని సూచించారు.

## జీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఏ అలీం

కాసిపేట, డిసెంబర్ 15 : కాసిపేట మండలంలోని మద్దిమాడ గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. జీపీ భవన పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఎంపీడీవో వెంట ఏఈ పీఆర్ పరంజ్యోతి ఉన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా కాపాడాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మంద అనిత

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 15: బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల లక్ష్మీపూర్ శివారులోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని మాజీ సర్పంచ్ మంద అనిత శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీపూర్ లోని 112 ,134 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆమె వినతిపత్రంలో తెలిపింది. ఈ రెండు సర్వేనంబర్లలోని ప్రభుత్వ భూముల్లో జరిగిన నిర్మాణాలకు అధికారులు ఇంటినంబర్లు కూడా ఇచ్చారని తెలిపారు. ఈ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దందాలు చేస్తూ లక్షల రూపాయలకు అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు.గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కబ్జా భూములను స్వాధీనం చేసుకొని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

## గనిపై రాపర్తి శ్రీనివాస్‌కు ఘనంగా సన్మానం



రాపర్తి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కాసిపేట, డిసెంబర్ 15 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై శుక్రవారం కాసిపేట మండల కేంద్రానికి చెందిన రాపర్తి శ్రీనివాస్ ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉండి సమస్యలపై పోరాడి, పరిష్కారానికి కృషి చేస్తానని, గనులపై పర్యటించి సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, నాయకులు సిద్ధం తిరుపతి, నస్పూరి నర్సింగ్, కోడూరి మునిందర్, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఫిర్యాదు

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 15 : తమ విధులకు ఆటంకం కలిగించి, తమపై దాడిచేసిన ఎస్సీ కులస్థుడు లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ కోరారు. ఈ మేరకు చెన్నూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ వాసుదేవరావుకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కులానికి చెందిన పెద్ద లచ్చు (లక్ష్మణ్) గత అక్టోబర్‌లో శివారం పరిధిలో ఒక అడవి పందిని వేటాడి చంపి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. గమనించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ ఆయనను పట్టుకొని కేసు నమోదు చేశాడు. వాహనాన్ని సీజ్ చేశాడు. ద్విచక్రవాహనానికి సంబంధించి జరిమానా కట్టించుకున్నాడు. సెక్షన్ ఆఫీసర్ రోజువారీ విధుల్లో భాగంగా కార్యాలయానికి చెన్నూర్‌లోని సాయినగర్ నుంచి వెళ్తుండగా, అధికారి వాహనాన్ని తన ఇంటి ముందు లక్ష్మణ్ అడ్డగించాడు. జరిమానా చెల్లించిన తర్వాత వాహనం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించాడు. అధికారి చెన్నూర్‌లోని రేంజ్ ఆఫీస్‌కు రాగా, ఆయన వెంటే లక్ష్మణ్ కూడా వచ్చాడు. తనతో పాటు సిబ్బందిని కూడా తిట్టారని, తమ విధులకు ఆటంకం కలిగించారని లక్ష్మణ్‌పై ఫారెస్ట్ సెక్షన్ అధికారి బాలకృష్ణ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

# బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే

తాండూర్, డిసెంబర్ 15 : జిల్లా ఉన్నతాధికారులు, మండల విద్యాశాఖాధికారి వాసాల ప్రభాకర్ ఆదేశాల మేరకు తాండూర్ మండలంలోని 6-19 సంవత్సరాల వయస్సు గల బడి బయట గల (ఓఎస్‌సీ)విద్యార్థులను గుర్తించేందుకు శుక్రవారం సీఆర్పీలు, ఐఈఆర్పీలు సర్వేను ప్రారంభించారు. ఈ నెల 11న ప్రారంభమైన ఈ సర్వే వచ్చే నెల జనవరి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఎంఈవో పర్యవేక్షణలో సీఆర్పీలు ఎన్ నాగరాజు, జీ తిరుపతి, ఐఈఆర్పీలు ఆర్ వెంకటేశ్వర్లు, సతీశ్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో గుర్తించిన పిల్లలను బడిలో చేర్పిస్తామని ఎంఈవో చెప్పారు. సర్వే అనంతరం నివేదికను డీఈవోకు పంపిస్తామని తెలిపారు.



తాండూర్: కిష్టంపేట్‌లో సర్వే చేస్తున్న సీఆర్పీలు, ఐఈఆర్పీలు

**బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి**

కాసిపేట, డిసెంబర్ 15 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ధర్మారావుపేట సీఆర్పీ మడావి తిరుపతి పిల్లల తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం కాసిపేట మండలంలోని ధర్మారావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని లక్ష్మీపూర్ కోలంగూడలో బడి బయట పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించారు. నలుగురు బడి బయట పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను ప్రబంద్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పిస్తామని సీఆర్పీ తిరుపతి తెలిపారు. సర్వేలో కోలంగూడ పాఠశాల హెచ్‌ఎం సమ్మయ్య పాల్గొన్నారు.



కాసిపేట : సర్వే చేస్తున్న సీఆర్పీ మడావి తిరుపతి

## రేపు మండల సర్వసభ్య సమావేశం

కన్నెపల్లి, డిసెంబర్ 15 : కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధాకిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## టీసీసీకి దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 15 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) లైన్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులకు పరీక్షలు రాసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో కోరారు. 7వ తరగతి ఆపై తరగతులు పాస్ అయిన వారు లోయర్ గ్రేడ్ పరీక్షలకు అర్హులని, లోయర్ గ్రేడ్ పాసయినవారు హైయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్షలు రాయాలనుకునేవారు జనవరి 18లోపు www.bse.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని ఆ ప్రతిని డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.